

కూరగాయల అలంకరణలో అమ్మవారు

శాకంబరీ దేవిగా బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం మూడో మంగళ వారం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ తల్లి శాకంబరీ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. దాతలు అందజేసిన 30 క్వింటాళ్ల కూరగాయలతో అమ్మవారి ని సుందరంగా అలంకరించారు. కాగా, అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈవో అంజనీదేవి, ఛైర్మన్ సాయిబాబా గౌడ్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆలయాల వద్ద శుభ్రత పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న బాబా

బోరబండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోనాల జాతర నేపథ్యంలో ఆలయాల వద్ద పరిశుభ్రత పాటించాలని, అందుకు శానిటేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాలని కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. బోనాలు పండుగ సందర్భంగా సైట్-1 తుర్రెబాజ్‌ఖాన్ కమ్యూనిటీహాల్లో జీహెచ్‌ఎంసీ, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కులు చెల్లించడానికి బోనంతో ఆలయానికి వచ్చే మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఖైరతాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పైన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఖైరతాబాద్ ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన సోఫియన్ అహ్మద్(20) నగరానికి వచ్చిన తన మిత్రుడు ఆదిల్‌ను మెదక్‌లో దించడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ముగ్గురు ద్విచక్ర వాహనాలపై సోమవారం రాత్రి బయలుదేరారు. సోఫియన్ అహ్మద్ తన హోండా యాక్టీవా ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పైకి వచ్చాడు. ఆ సమయంలో వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో ప్రక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలకు గురైన సోఫియన్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా తెల్లవారుజామున 2.30కు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. వెనక కూర్చున్న ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ఉద్యోగం నచ్చలేదని టెకీ ఆత్మహత్య

బంజారాహిల్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం నచ్చలేదని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(టెకీ) ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు జిల్లా నంద్యాల బత్తూలూరుపాడు గ్రామానికి చెందిన సోముల సుభాశ్‌రెడ్డి(23) జూబ్లీహిల్స్‌లోని శ్రవంతినగర్‌లో తన బాబాయి ఇంటివద్ద ఉంటున్నాడు. బీటెక్ పూర్తి చేసిన అతనికి కూకట్‌పల్లిలోని వెంక్యూస్ టెక్నాలజీస్‌లో ఉద్యోగం వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం తనకు ఇష్టం లేదని ఇంట్లో చెప్పలేక ఆరు నెలలుగా పని చేస్తున్నాడు. ఆ వేదనతో 22వ తేదీన రాత్రి వేళ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొద్ది సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు అతనిని కిందకు దించి చూసేసరికి మృతి చెందాడు. తనకు ఆ ఉద్యోగం నచ్చక ఆత్మహత్య చేసుకున్నట్టు ఓ నోట్ రాసి పెట్టాడు. ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పబ్ నిర్వాహకులకు రెండు రోజులు జైలు

బంజారాహిల్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లఘించి హోరెత్తే సౌండ్‌తో చుట్టు పక్కల వారికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన పబ్‌ల నిర్వాహకులకు రెండు రోజుల జైలు శిక్ష పడింది. జూబ్లీహిల్స్‌లోని ది బాటిల్, క్లబ్ రోగ్ పబ్‌లలో అనుమతించిన దాని కంటే పెద్ద శబ్ధాలు వస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దాడులు నిర్వహించి అది వాస్తవమేనని తేల్చారు. దీంతో పబ్ మేనేజర్ సుమిత్ ప్రధాన్, డీజేలు యశ్వంత్, గిరీశ్‌కుమార్, క్లబ్ రోగ్ రవీందర్, డీజే జితేష్ తొలానీలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి నాంపల్లి పదో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదురుగా హజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

ప్రహరీ కూలి ఒకరి మృతి



కూలిన ప్రహరీ

బంజారాహిల్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నిర్మాణదారుడి నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణం బలితీసుకుంది. పాత ప్రహరీని తొలగించకపోవడంతో అది కూలి అక్కడ పని చేస్తున్న ఓ కూలి మృతి చెందాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 31లో ఓ బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. గుత్తేదారు సుధీర్‌రెడ్డి అక్కడ పాత ప్రహరీని అలాగే ఉంచి పనులు చేయిస్తున్నారు. కాగా, 21న బిహార్‌కు చెందిన క్రిసిందునెయిల్ వ్యక్తి అక్కడ పని చేస్తుండగా అకస్మాత్తుగా ఆ గోడ కూలి అతనిపై పడింది. గమనించిన తోటి కూలీలు అతన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ క్రిసిందు మృతి చెందాడు. జూబ్లీహిల్స్ పోలీసులు గుత్తేదారుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌ను వాహనంతో ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ వెళ్తుండగా ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫొటో తీశాడు. అదినచ్చక కోపంతో ఊగిపోయిన ఓ వ్యక్తి కాన్స్టేబుల్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్‌లో ఏఆర్‌పీసీగా సూర్యనారాయణ విధులు నిర్వహిస్తున్నాడు. రోడ్డు నెంబరు 13 చౌరస్తాలో విధుల్లో ఉండగా జ్ఞానేశ్వర్ అనే వ్యక్తి యాక్టివా వాహనంపై ఫోన్ మాట్లాడుతూ వెళ్తుండగా ఫొటో తీశాడు. ఇది గమనించిన జ్ఞానేశ్వర్ వాహనం వెనక్కి తప్పి సూర్యనారాయణతో వాగ్వావాదానికి దిగి ఆగ్రహంతో వాహనంతో ఢీ కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు కేమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, జూలై23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో ఓ యువతి నుంచి నగదు కాజేశాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లాకు చెందిన శిరీష మధురానగర్‌లో హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటుంది. ఈ నెల 9న వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటూ వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది. ముందు రూ.100 చెల్లిస్తే జాయిన్ అవ్వవచ్చని అనంతరం జాబ్ చేస్తూ డబ్బు సంపాదించవచ్చని తెలిపారు. దీంతో ఆమె రూ.100 చెల్లించింది. తర్వాత ఐదు టాస్కులు పూర్తి చేయాలంటూ ఆమె వద్ద నుంచి రూ.20,500 ఆన్‌లైన్ ద్వారా కట్టించుకున్నారు. అనంతరం ఆ డబ్బు గురించి అడిగితే ఫలితం లేకుండా పోయింది. దీంతో మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 రోజులు.. ప్రమాదాలు..

- ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై వరుస ప్రమాదాలు
- సీసీ రోడ్డు అరగడంతో జారుతున్న వాహనాలు
- అదుపు తప్పి కింద పడిపోతున్న పరిస్థితి
- పట్టించుకోని ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు

ఇద్దరి మృతి



ఖైరతాబాద్ ఫ్లైఓవర్



ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

ఖైరతాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే చాలు ఖైరతాబాద్ ఫ్లైఓవర్ రోడ్డు ప్రమాదకరంగా మారుతోంది. చాలా కాలం క్రితం వేసిన సీసీ రోడ్డు కావడంతో అది పూర్తిగా అరిగిపోయింది. దీనికితోడు రోడ్డు మధ్యలో అతుకుల వద్ద వేసిన డాంబర్ కోటింగ్‌ల వల్ల ద్విచక్ర వాహనాలు పైకి ఎగిరి అదుపుతప్పి పడిపోతున్నాయి. గత ఆది, సోమవారాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తుండగా ఇద్దరు యువకులు వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టింది. ఇద్దరికీ తీవ్ర గాయలు కాగా చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. మరుసటిరోజు సోమవారం అర్థరాత్రి ముగ్గురు వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలై మృతి చెందాడు.

చినుకు పడితే అంతే సంగతి

ఎన్టీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ నిర్మించారు. దాదాపు 40 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఫ్లైఓవర్‌పై వెళ్తుంటే అతుకుల వద్ద వైబ్రేషన్స్ వస్తాయి. దీనికితోడు పైన వేసిన సీసీ రోడ్డు పూర్తిగా అరిగిపోయింది. దీంతో చిన్న వర్షం కురిసినా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ ఫ్లైఓవర్‌పైన రెండు వైపులా రెండు భారీ మలుపులు ఉన్నాయి. వేగంగా వెళ్తూ మూలమలుపుల వద్ద బ్రేక్ వేసినా ఆగకుండా వాహనం జారి అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధత అధికారులు దృష్టి సారించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాం



వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం. మూల మలుపుల వద్ద వేగాన్ని నిరోధించేందుకు కోన్‌లను ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాం. రోడ్డు పరిస్థితిపై జీహెచ్‌ఎంసీ వర్గాలతో చర్చించి చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు ఎక్కువగా వేగంగా వెళ్లడం వల్లే జరుగుతున్నాయి. వర్షం పడ్డ సమయాల్లో జాగ్రత్తగా, నెమ్మదిగా వెళ్లాలి. - రాజశేఖర్, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



బోనాలతో వెళ్తున్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత విజయారెడ్డి

ఫిలింనగర్‌లో ఘనంగా బోనాలు

బంజారాహిల్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ బోనాలు మంగళవారం ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. డప్పుచప్పుళ్లు, పోత రాజుల విన్యాసాలతో బస్తీల్లో సందడి నెలకొంది. గౌతమ నగర్, ఛత్రపతి శివాజీనగర్, దీన్ దయాల్ నగర్, దుర్గా భవానీ నగర్ ప్రాంతాల్లో వైభవంగా బోనాలు నిర్వహించారు. దుర్గా భవానీనగర్ మారెమ్మ-ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. వందలాది మంది మహిళలు ఒకేసారి సామూహికంగా బోనాలు తీసుకురావడంతో సందడి వాతావరణం నెలకొంది. అలాగే పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వమించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ స్థలాలకు త్వరలో ఫెన్సింగ్

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ గ్రామంలోని సర్వేనెంబరు 25/1, 25/2లో ఉన్న యాదిరెడ్డిబండ, రంగారెడ్డిబండ, సయ్యద్‌బస్తీ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆర్‌డీఓ శ్యామ్‌ప్రకాష్, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం ఆయా స్థలాలను పరిశీలించారు. ఈ సర్వేనెంబర్‌లో హెచ్‌ఎండీఏకు, ఆర్‌జీకె హౌసింగ్ సొసైటీకి ఎంత కేటాయించారని, ఎంత ఆక్రమణకు గురైందని, ఆక్రమణకు గురైన స్థలాల్లో ఎన్ని నిర్మాణాలు వెలిశాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సర్వేనెంబర్లలో 35 ఎకరాలు హెచ్‌ఎండీఏకు, 7 ఎకరాలు ఆర్‌జీకే హౌసింగ్ సొసైటీకి 2008లోనే వారికి అప్పజెప్పినట్లు రెవెన్యూ అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెహ్మాన్, ఆర్‌ఐ రేణుక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

మియాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ రెండు రోజుల సమావేశాలు మియాపూర్ ముజఫర్ అహ్మద్‌నగర్ తాండ్ర రామచంద్ర స్మారక భవనంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయాల అశోక్‌ఓంకార్ హాజరై మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు సమానమైన పద్ధతుల్లో, ఆయా రాష్ట్రాల ఆదాయం ప్రాతిపదికన నిధులు కేటాయించలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు, బీజేపీకి మద్దతిస్తున్న పార్టీలు ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించాయారని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వెంకన్న, ఎన్‌రెడ్డి హింసారెడ్డి, పెద్దారపు రమేష్, నజీర్, తుకారం నాయక్, కుమారస్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో

బోనాల జాతర విజయవంతం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ



అమీర్‌పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుక విజయవంతమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ, అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు ఇలా అన్నివర్గాల నుంచి సహాయ సహకారాలు అందాయన్నారు. జీహెచ్‌ఎంసీ, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు వలంటీర్లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముఖ్యంగా 15 వందల మంది పోలీసులు పర్యవేక్షించారన్నారు. భక్తులకు మంచినీటి సమస్య తలెత్తకుండా వాటర్ వర్క్స్ విభాగం 7లక్షల వాటర్ ప్యాకెట్లను అందజేసిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస రావుతో పాటు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు క్రిష్ణ యాదవ్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జీడిమెట్ల: చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపుల నుంచి రక్షించుకోవడానికి ప్రతీ విద్యార్థి పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ప్రభు త్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు లైంగిక వేధింపులు, వాటి నుం చి ఎలా రక్షించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు లైంగిక వేధింపుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

పుట్టిన ఆస్పత్రిలోనే ఉన్నతాధికారిగా..

నిలోఫర్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్



హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టిన ఆస్పత్రిలోనే ఉన్నతాధికారిగా సేవలందించే అదృష్టం దక్కించుకున్నాడు ఓ డాక్టర్. నిలోఫర్ ఆస్పత్రిలో జన్మించిన డాక్టర్ రవికుమార్ ఇప్పుడు అదే ఆస్పత్రికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి బదిలీ కావడంతో డాక్టర్ రవికుమార్‌ను నియమించారు. ఆస్పత్రిలో జన్మించడంతో పాటు ఇక్కడే ఉన్నత వైద్య విద్యను అభ్యసించి పలు పదవులు అందుకుని ఈ స్థాయికి చేరుకున్నారు. ఆయన 1961లో నిలోఫర్ ఆస్పత్రిలో జన్మించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ పరిధిలోని ఈ ఆస్పత్రిలోనే పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యను పూర్తి చేశారు. పిల్లల వైద్యుడుగా, ప్రొఫెసర్‌గా అక్కడే సేవందించారు. 2018-20 వరకు పిల్లల విభాగాధిపతిగా సేవలు అందించారు. అలాగే హెచ్‌ఐవీ ప్రోగామ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిలోఫర్ ఆస్పత్రిలో టీచింగ్ (బోధన), ట్రీటింగ్ (చికిత్స)ను మరింత బలోపేతం చేయడం తన ప్రధాన ఏజెండాగా ఆయన చెప్పారు.

మెడికల్ దుకాణంపై దాడులు, కేసు నమోదు

హైదరాబాద్‌సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో యాంటీ ఫంగల్ ఔషధం 'ఐకాన్-200' క్యాప్సూల్స్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కేంటే అధికంగా విక్రయిస్తున్న దుకాణంపై ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. ఓ మెడికల్ దుకాణంలో ఎక్కువ ధరకు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారంతో అందడంతో సోమవారం దాడులు నిర్వహించిన అధికారులు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఒక్కో క్యాప్సూల్స్ ధర రూ.22.12 ఉండగా దానిని 44.12 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు దుకాణం యజమానిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో అధికారులు తిరుపతి, విజయ్‌గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీప్లెక్స్‌లు, మాల్స్‌ల్లో పార్కింగ్‌పై తనిఖీలు



సెంట్రల్‌మాల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖైరతాబాద్, జూలై23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 63 నేపథ్యంలో మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్‌ల్లోని పార్కింగ్ వసతులపై జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సోమ, మంగళవారాల్లో ప్రసాద్ ఐమాక్స్ మల్టీప్లెక్స్‌తో పాటు హైదరాబాద్ సెంట్రల్, బిగ్‌బజార్‌తో పాటు పలు మాల్స్‌లో తనిఖీలు చేపట్టారు. వారి సామర్థ్యం, వ్యాపార సరళి, పార్కింగ్ వసతులపై ఆరా తీశారు. జీవో 63 ప్రకారం పెద్ద వాణిజ్య సముదాయాల్లో సొంత పార్కింగ్ తో పాటు పూర్తి ఉచితంగా పార్కింగ్ వసతి కల్పించాలి. చాలా చోట్ల పార్కింగ్‌కు ఫీజులు వసూలు చేస్తుండడం, కొన్నింటికి అసలు పార్కింగ్ వసతి లేకపోవడంతో అధికారులు దీనిపై విచారించాలని నిర్ణయించారు.

బస్తీల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీత

బేగంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలతో పాటు బస్తీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ అధికారును ఆదేశించారు. ఆమె మంగళవారం సోమాజిగూడలోని దుర్గా భవాని అమ్మవారి అలయ పరిసరాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను తరలించాలి



సమావేశంలో ఖాజీపల్లి జేఏసీ నాయకులు

పంజాగుట్ట, జూలై23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ ఖాజీపల్లిలో కాలుష్యం వెదజల్లుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఫార్మా, రసాయన పరిశ్రమలను తరలించాలని ఖాజీపల్లి గ్రామ జేఏసీ ఛైర్మన్ రమాకాంత్ దండే డిమాండ్ చేశారు. సినీ నటుడు ప్రభాస్ దత్తత తీసుకున్న అటవీ ప్రాంతం తమ గ్రామ పరిధిలో ఉందని ఆయన అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు మహేష్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ రయిస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐడీఏ ఖాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల పరిధిలో 30కి పైగా ఫార్మా, రసాయన పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఇవి కాలుష్యాన్ని, విష వాయువులను, రసాయన వ్యర్థాలను బయటికి వదులుతుడడంతో పాటు నిబంధనలు పాటించకపోవడంతో తమ రెండు గ్రామాల ప్రజలే కాకుండా కిష్టయ్యపల్లి, గండిగూడెం, అలీనగర్ గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే మూగజీవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలుష్యం నుంచి తమ ఐదు గ్రామాలను కాపాడాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తాము ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించినా స్పందన లేకుండా పోయిందన్నారు. వెంటనే రెండు సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటులను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రముఖ సినీనటుడు ప్రభాస్ తమ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకున్నారని, ఆయన కూడా స్పందించాలని అన్నారు. గడిచిన కొంతకాలంగా కాలుష్యకార పరిశ్రమలను తరలించాలని జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని తెలిపారు. కాలుష్యకార వ్యర్థాలను విడుదల చేస్తున్న పరిశ్రమలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు సురేష్, జితేందర్, భరత్ చారి, ఎండి హసేన్సిన్,ఆకుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యతో డాక్టర్ కేవీ.రమణాచారి తదితరులు

ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యకు 'శలాక విద్వత్ సమర్చన' అవార్డు ప్రదానం

తార్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పుంభావ సరస్వతి ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య శలాక విద్వత్ సమర్చన అవార్డును అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం డా.కేవీ.రమణాచారి అధ్యక్షతన స్వాధ్యాయ గ్రంథాలయ పరిశోధనా సంస్థలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో శలాక రఘునాథశర్మ దంపతులు ఆయనకు అవార్డును అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డా.కేవీ.రమణాచారి మాట్లాడుతూ ఆచార్య సుప్రసన్నకు ఈ పురస్కారాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య మాట్లాడుతూ నేటి సమాజంలో సాహిత్యంతోపాటు సంస్కృత ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పేరంబుదూరు శ్రీరంగాచార్యులు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య యాదగిరి, డా.అక్కిరాజు సందర రామకృష్ణ, డా.వరుల రంగాచార్య, ముత్యం రామ్మోహన్, డా.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి : కాసాని

పద్మారావునగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, బీసీ 'డీ' గ్రూప్ నుంచి 'ఏ' గ్రూప్‌లోనికి మార్చటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగూడలోని ముదిరాజ్ మహాసభ భవనంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ఆర్ హయాంలో జీవో నెం.15 ద్వారా ముదిరాజులను బీసీ గ్రూప్ 'డీ' నుంచి 'ఏ'కు మార్చారని గుర్తుచేశారు. అనంతరం కోర్టు కేసులు ఇతరత్రా కారణాల వల్ల అది అమలు కావడంలేదని తెలిపారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

అందరి సహకారంతో బోనాల జాతర విజయవంతం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ



అమీర్‌పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే సికింద్రాబాద్ ఉజ్జయిని మహకాళి బోనాల జాతర విజయవంతమైందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. అమీర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిన ప్రత్యేకచొరవ, అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు ఇలా అన్నివర్గాల నుంచి సహాయ సహకారాలు అందాయన్నారు. జీహెచ్ఎంసీ, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖలు, లాఅండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తోపాటు వలంటీర్లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా 1500 మంది పోలీసులు పర్యవేక్షించారన్నారు. భక్తులకు మంచినీటి సమస్య తలెత్తకుండా వాటర్‌వర్క్స్ విభాగం 7లక్షల వాటర్‌ప్యాకెట్లను అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు క్రిష్ణయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి సీహెచ్.శంకర్‌రావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ యూనియన్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయంగా పెన్షనర్ల వెల్ఫేర్ ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, పెన్షనర్ వెల్ఫేర్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి ఉదయ భాస్కరరావు, అరుణ్‌కుమార్, పద్మనాభయ్య కొమురయ్య, యూనియన్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, వెంకటయ్య పాల్గొన్నారు.


స్మితాసబర్వాల్‌పై ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి నాయకులు

స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఓయూ పీఎస్‌లో టీవీహెచ్ఎస్ ఫిర్యాదు

తార్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సర్వీసుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా అంటూ దివ్యాంగులను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసిన స్మితాసబర్వాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సమితి (టీవీహెచ్ఎస్) నాయకులు డిమాండ్ చేశారు. స్మితాసబర్వాల్ వ్యాఖ్యలను నిరసిస్తూ టీవీహెచ్ఎస్ నాయకులు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆమె చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం ఆమెను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీవీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల వెంకటయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుర్గం వెంకన్న, సుమన్, ఆంజనేయగౌడ్, పాండురంగ, నరేష్, స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ విద్యా సంస్థల్లో డ్రగ్స్ తనిఖీలు చేయాలి'

తార్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా తెలంగాణ విద్యాశాఖ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సంయుక్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు డ్రగ్స్‌కు అడ్డాగా మారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత స్నేహితులతో కలిసి డ్రగ్స్‌తో కూడిన మత్తు పానీయాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటోందని అన్నారు. ఇప్పటికైనా డ్రగ్స్ కట్టడికి తెలంగాణ విద్యాశాఖ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సంయుక్తంగా విద్యాసంస్థల్లో విస్తృతంగా తనిఖీలను నిర్వహించాలని కోరారు.

ప్రారంభమైన లాల్‌బజార్ బోనాలు


ముస్తాబైన లాల్‌బజార్ మహాకాళి దేవాలయం

తిరుమలగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని శ్రీమహాకాళి దేవాలయంలో మంగళవారం నుంచి బోనాల జాతర ప్రారంభమైందని ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఈఓ మాట్లాడుతూ.. ఉదయం హోమంతో జాతరను ప్రారంభించామన్నారు. బుధవారం బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. గురువారం సాయంత్రం రంగం కార్యక్రమం ఉంటుందని, అదే రాత్రి అమ్మవారిని ఊరిపొలిమేరకు సాగనంపడంతో జాతర ముగుస్తుందని తెలిపారు.

1836లో తిరుమలగిరి బోయిన్ చెరువుకు చెందిన అంబటి గంగయ్య అమ్మవారిని ప్రతిష్ఠించారని, అప్పటినుంచి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ.. నగరంలోనే ప్రతిష్ఠాత్మకంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని, అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఈ చెప్పారు. సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయినీ మహాకాళి దేవాలయం నుంచి సూరిటి అప్పయ్య కుటుంబీకులు ఈ అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మహాకాళి మందిరం అధ్యక్షుడు మురళీముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం, నిరంజన్, సుధాకర్, నాగేష్ పాల్గొన్నారు.

ఉజ్జయిని మాదిరిగానే ఇక్కడా ఘటం ఊరేగింపు


ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిసారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని ఘటం రూపంలో ఊరేగించేవారు. దీంతోపాటు జాతర జరుగుతున్న తీరుతెన్నులను చూసిన లాల్‌బజార్ గ్రామస్తులు మన అమ్మవారిని కూడా ఘటం రూపంలో ఊరేగించాలని గంగయ్యను కోరారు. జాతరను నిర్వహించడానికి ఎవరెవరిని నియమించాలో, ఎటువంటి పనులు అప్పగించాలో గంగయ్య సూచనలు చేశారు. ఆ తరవాత కొండల పెరుమక్క అనే లాల్‌బజార్‌కు చెందిన మహిళకు అమ్మవారు కలలోకి వచ్చి తనకు గుడి నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న గుడిని ఆమే నిర్మించారు.

మగవారితోనే రంగం

సికింద్రాబాద్ మహాకాళి జాతరలో మహిళ భవిష్యవాణి వినిపించడం ఆనవాయితీ. అయితే లాల్‌బజార్‌లో రంగం కార్యక్రమంలో మగవారితోనే భవిష్యవాణి(రంగం) వినిపించడం విశేషం. ఏర్పుల జగదీష్ భవిష్యవాణి వినిపిస్తారు.

బుధవారమే జాతర ఎందుకంటే?

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి జాతర, లాల్‌బజార్ బుజిలీ మహాకాళి జాతర రెండు కూడా ఆషాఢ మాసం ఆదివారం రోజున వచ్చాయి. దీంతో అక్కడి బంధువులు ఇక్కడికి, ఇక్కడి బంధువులు అక్కడికి పోలేక పోయారు. ఈ ఇబ్బందులు లేకుండా సికింద్రాబాద్ బోనాల జాతర ముగిసిన మరుసటి రోజే అమ్మవారి ఘటం ఎదుర్కోళ్లతో ఇక్కడ జాతరను ప్రారంభించారు. బుధవారం బోనాలు, గురువారం రాత్రి ఘటం సాగనంపడంతో జాతర ముగుస్తుంది.

పూర్వం దున్నపోతు బలి

స్వాతంత్ర్యం రాకముందు అమ్మవారి ఎదుట దున్నపోతును బలిచ్చేవారు. క్రైస్తవ మతానికి చెందిన ఓ వ్యక్తి దున్నపోతును బలిచ్చేవాడు. అనంతరం కొన్ని వర్గాలు అభ్యంతరం తెలపడంతో ప్రస్తుతం గుమ్మడికాయను బలిస్తున్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ

లాల్‌బజార్ మహాకాళి అమ్మవారి బోనాలను స్థానికులు ప్రశాంతంగా జరుపుకోవాలని తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. క్రౌడ్ అధికంగా ఉంటున్న నేపథ్యంలో జేబుదొంగలు ఉంటారని, మహిళలు తమ ఆభరణాలను సెల్‌ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఫలహారం బండ్లను నిర్వాహకులు ప్రశాంతంగా ఊరేగించాలని తెలిపారు. సుమారు 200 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజీవ్ రహదారిని ఆనుకొని బోనాల జాతర జరుగుతున్న నేపథ్యంలో బస్సుల రాకపోకలకు ఎటువంటి అంతరాయమూ కలుగకుండా ఉండాలని భక్తులకు, నిర్వాహకులకు సూచించారు.


ఆర్డీఓ కార్యాలయంలో వినతిప్రతం అందజేస్తున్న శ్రీకాంత్ తదితరులు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఓబీసీ నాయకులు ధర్నా చేశారు. ఆ సమయంలో కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడం వల్ల ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ యువతకు ర్యాంకుతో సంబంధంలేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని కాలయాపన చేస్తున్నారని, మత్స్య సంఘాల వారికి ఇప్పటి వరకు చేపపిల్లలను పంపిణీ చేయలేదని అన్నారు. బీసీలోని ముదిరాజ్ తదితర కులాలవారిని 'ఏ' గ్రూప్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సనత్‌నగర్ నియోజకవర్గ కో కన్వీనర్ కంది శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, నాయకులు ఉమేష్ ఖండేల్వాల్, చీర శ్రీనివాసులు, సందీప్ వర్మ, శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి అంతర్ పాఠశాలల టోర్నమెంట్

మారేడుపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ది సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ (ఎస్‌పీఎస్) 12వ రుక్మిణీ బాయ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25, 26వ తేదీలలో అంతర్ పాఠశాలల టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ పి.జ్యోతి మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జంటనగరాలకు చెందిన దాదాపు 1000 మంది వరకు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను స్వర్గీయ మాజీ కరస్పాండెంట్ మధుసూదనరావు మాతృమూర్తి రుక్మిణీబాయ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో విజేతలకు బహుమతులతో పాటు ట్రోఫీలు, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఈ పోటీలను మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రెటరీ ధనుంజయరెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మారేడుపల్లి పద్మశాలీ కల్యాణ మండపం వేదికగా టేబుల్ టెన్నిస్, కరాటే, క్యారమ్స్, సికింద్రాబాద్ స్కూల్‌లో చెస్, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి గౌరవఅతిథిగా జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్ హితేష్ డోల్‌వాని, తెలంగాణ టేబుల్ టెన్నిస్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీలక్ష్మీకాంత్, అకాడమీ డైరెక్టర్ ఆగస్టిన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

● **సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ పంపిణీ**



సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీకి చెందిన హేమలత వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం మారేడుపల్లిలోని తన నివాసంలో ఆమె సోదరుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

రూ.40 కోట్ల టీపీటీ బకాయిలను విడుదల చేయాలి : రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

సికింద్రాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన రూ.40 కోట్ల టీపీటీ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డుకు టీపీటీ బకాయిలు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కోర్టుకు వెళితే తప్ప బకాయిలు చెల్లించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం శోచనీయమన్నారు. రాష్ట్ర విభజనకు ముందు రిజిస్ట్రేషన్ చార్జీలు నేరుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు జమయ్యేవన్నారు. ఇక నుంచి కూడా అదే పద్ధతిలో జమయ్యేలా చూడాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. టీపీటీ బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే మరోసారి కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు.

అధ్వానంగా బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు


కూరగాయల వ్యర్థాలను తింటున్న పశువులు

బోయిన్‌పల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతి పెద్ద కూరగాయల మార్కెట్‌యార్డు అయిన బోయినపల్లి మార్కెట్ యార్డు అధ్వానంగా మారింది. ఎక్కడచూసినా మురుగు, బురద, కూరగాయల వ్యర్థాలు కుళ్లిపోయి దర్గంధం వస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మార్కెట్‌యార్డు అధ్వానంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొనుగోలుదారులు, కూరగాయలను అమ్ముకోడానికి వచ్చిన రైతులు కంపును తట్టుకోలేక పోతున్నారు. ఏ రోజుకారోజు మార్కెట్ యార్డును క్లీన్ చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణం. రైతులు పంటను అమ్ముకోగా పాడైపోయిన కూరగాయలు, ఆకుకూరలను షాపుల్లోని వ్యర్థాలను మార్కెట్‌లోనే కుప్పలుగా పోస్తున్నారు. పారిశుధ్య విభాగం సిబ్బంది వాటిని తరలించకపోవడంతో పరిసరాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వానలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది.

బోయినపల్లి మార్కెట్ యార్డులో కెపాసిటీకి మించి అమ్మకందారులు ఉండడంతో సమస్య తీవ్రమవుతోంది. కేటాయించిన షాపుల్లో కాకుండా లైసెన్స్ ఉన్నవారు వారివారి దుకాణాల ముందు ఎక్కడ పడితే అక్కడ వేరేవారికి స్థలాన్ని అద్దెకిస్తున్నారు. దీంతో ఎక్కడపడితే అక్కడ కూర్చొని లైసెన్స్ లేనివారు రైతుల నుంచి కూరగాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. అనంతరం కూరగాయల వ్యర్థాలను అక్కడే పడేసి వెళుతున్నారు.


బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో పేరుకుపోయిన బురద

దీనికితోడు అధికారులు పట్టించుకోవడంలేదు. పారిశుధ్య విభాగం సిబ్బంది ఎంతసేపూ వారి నుంచి ఎంతలాగాలి, రైతులను ఎలా భయపెట్టి వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్మేలా చూసి, కమీషన్లు తీసుకోవడంపైనే శ్రద్ధ పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీనికితోడు మార్కెట్‌యార్డులో వర్షపునీరు నిలిచి ఆ ప్రాంతంలో బురదగా ఏర్పడుతోంది. కూరగాయలు కొనుగోలు చేస్తున్న వారి సంచులు బురదగా మారుతున్నాయి. దీంతో వానలు కురిసే సమయంలో మార్కెట్ యార్డుకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించాలని, దోమలు, ఈగలు రాకుండా బ్లీచింగ్‌పౌడర్, మందులు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

● **దత్తాత్రేయకు ఆహ్వానం**



ఈనెల 28, 29వ తేదీల్లో చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో జరిగే బోనాల జాతరకు రావాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, చైర్మన్ గుంటికృష్ణ, సభ్యులు జంగిలి దేవేందర్‌యాదవ్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

● **ఎల్లమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు**



మారేడుపల్లి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాకాళి బోనాల జాతరను మంగళవారం నిర్వహించారు. శ్రీదుర్గా ఎల్లమ్మతల్లికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో కార్పొరేటర్ కొంతం దీపిక, జోనల్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. - (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

బోనాల జాతరలో భక్తులకు ఇబ్బందులు ఉండొద్దు


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ, ఉపకమిషనర్ సుభాష్‌రావు

బౌద్ధనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో ఈ ఆదివారం జరిగే బోనాల జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అధికారులను కోరారు. నామాలగుండు వార్డుకార్యాలయంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, వివిధ విభాగాల అధికారులతో కలిసి మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలు జరిగే రెండురోజులూ నీరు, నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని కార్పొరేటర్ కోరారు. భక్తులకు ఉచితంగా మంచినీటిప్యాకెట్లను పంపిణీచేయాలని, వైద్యశిబిరాలను ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ సంధ్య, మెడికల్‌ఆఫీసర్ రజనీకాంత్, డీఈఈ సువర్ణ, జలమండలి మేనేజర్స్ ప్రియాంక, అన్విత్, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.


వడ్డిస్తున్న జంపన ప్రతాప్

ఆషాఢమాసం అన్నదానం

బోయిన్‌పల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆషాఢం.. అన్నదానం కార్యక్రమాన్ని సదానందరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారై సదానందరెడ్డి, సరళ కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ శ్రీదేవి నల్లపోచమ్మ అమ్మవారు ఆశీస్సులతో భక్తులు చల్లగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు మణికాంత్‌రెడ్డి, వీర నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అజిత్, రామారావు, ప్రేమ్‌కుమార్, నరసింహ, సందీప్, శ్రీకాంత్, మోని తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

సికింద్రాబాద్, బౌద్ధనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పట్ల లష్కర్‌వాసులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముద్ర లోన్ పరిమితిని రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచడం, ఉన్నత విద్యాభ్యాసం కోసం రుణాలు ఇవ్వడం, యువత కోసం ఐదు పథకాలతో పీఎం ప్యాకేజీ, కోటి ఇళ్లకు సోలార్ ప్యానళ్ల ద్వారా ఉచిత విద్యుత్ తదితర పథకాలతోపాటు కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల బంగారం, వెండి ధరలు తగ్గనున్నాయంటూ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు లోన్లు ఇవ్వడం సంతోషకరం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వటం సంతోషకరం. విద్యార్థుల చదువు కోసం మోడల్ స్కిల్ రుణ పథకంలో మార్పులు తీసుకువచ్చారు. దీంతో ప్రతి సంవత్సరం 25వేలమంది విద్యార్థులకు లబ్ధి చేకూరడం సంతోషకరం. ఈ-వోచర్ల రూపంలో స్వదేశీ విద్యాసంస్థల్లో ఉన్నతచదువులకు రూ.10ల వరకు విద్యార్థులకు రుణం ఇవ్వనున్నారు. ప్రతి సంవత్సరం లక్షమంది విద్యార్థులకు డైరెక్ట్‌గా ఈ లోన్‌ను ఇవ్వనున్నారు.

- జ్ఞానేశ్వర్‌గౌడ్, సీనియన్ సిటిజన్, నల్లకుంట

మొబైల్‌ఫోన్ల ధరలు తగ్గటం ఆనందదాయకం



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో మొబైల్ ఫోన్లు, చార్జర్ల ధరలను తగ్గించటం ఆనందదాయకం. ఇప్పుడు మొబైల్ ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. దీంతో మొబైల్ ఫోన్ల అమ్మకాలు మరింత పెరుగుతాయి.

- యాదగిరి ముదిరాజ్, వ్యాపారవేత్త, వారాసిగూడ

కేంద్ర బడ్జెట్ పేదవారికి ఆశాజనకం



కేంద్ర బడ్జెట్ పేదవారికి ఆశాజనకంగా ఉంది. బడ్జెట్‌లో కస్టమ్ డ్యూటీల నుంచి మూడు కేన్సర్ మందులకు మినహాంపు ఇవ్వడం, బంగారం, వెండిపై కస్టమ్ డ్యూటీని తగ్గించడం, మొబైల్ ఫోన్లు, చార్జర్స్ తదితర ధరలు తగ్గించడం, చదువుకునే విద్యార్థులకు వెసులుబాటు కల్పించడం సంతోషకరంగా ఉంది.

- శ్రావణ్‌కుమార్‌గౌడ్, కుషాయిగూడ

రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ల దొంగల అరెస్టు


సెల్‌పోన్ దొంగల్ని పట్టుకున్న ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తి టీం కానిస్టేబుళ్లు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సెల్‌ఫోన్లను దొంగతనం చేస్తున్న ఇద్దరి దొంగలను సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తీ టీం మహిళా కానిస్టేబుళ్లు అరెస్టు చేశారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నసీమా తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యరాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు యువకులు ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేస్తుండగా ఆర్పీఎఫ్ రుద్రమ్మశక్తి మహిళా కానిస్టేబుళ్లు మాధూరి సింగ్, రాధ, వందన, నీలిమామింజ్ పట్టుకున్నారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.